క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చార్మినార్: సాలార్‌జంగ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 28న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీఏడీఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నయాపూల్, మదీనా, పటేల్ మార్కెట్, రికాబ్ గంజ్, హైకోర్టు రోడ్, సిటీ కాలేజ్, కుడా స్టేడియం, చేలాపురా, ఘాన్సీ బజార్, పత్తర్ గట్టి, పంజేషా, కోట్ల అలీజ, మీర్ ఆలం మండి, సిటీ సివిల్ కోర్టు, పురానీ హవేలీ, దారుషిఫా, ఓల్డ్ పోలీస్ కమిషనర్ కార్యాలయం, మీర్ చౌక్ పీఎస్, మీర్ చౌక్ ఏసీపీ, పురాని హవేలీ ట్రిబ్యునల్ కోర్టు, సాలార్‌జంగ్ మ్యూజియం, చెత్త బజార్, కాలీ కమాన్, మూసాబౌలీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మెహిదీపట్నం డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు.

11 కేవీ పద్మనాభనగర్ ఫీడర్..

పద్మనాభనగర్, కరోల్‌బాగ్, లక్ష్మీనగర్, సప్తగిరి కాలనీ, నానల్‌నగర్ చౌరస్తా, రాఘవ పాఠశాల, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు.

11 కేవీ జ్యోతినగర్ ఫీడర్..

సప్తగిరి కాలనీ, ఖాదర్ బాగ్, రాక్‌హిల్స్ కాలనీ, బహదూర్ గంజ్ కాలనీ, సర్దార్ బాగ్, జ్యోతినగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించగలరని వారు కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

సంతోష్‌నగర్: మిధానీ ఆర్టీసీ డిపోలో ఈ నెల 28న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మిధానీ డీఎం విజయ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫోన్ (9959226139)లో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

లాల్‌కేసరి మెట్టు షణ్ముఖ్ పహిల్వాన్ మృతి


మెట్టు షణ్ముఖ్ పహిల్వాన్ (ఫైల్)

నాంపల్లి: కుస్తీ పోటీల్లో తనకంటూ గుర్తింపు పొందిన మెట్టు షణ్ముఖ్ పహిల్వాన్ శుక్రవారం తుది శ్వాస విడిచారు. హైదరాబాద్‌లోని మల్లెపల్లి డివిజన్ బోయిగూడ కమాన్ గంగపుత్ర కాలనీలో 16 ఏప్రిల్ 1959లో ఆయన జన్మించారు. చిన్నప్పటి నుంచే కుస్తీపై ఆసక్తి పెంచుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన కుస్తీ పోటీల్లో లాల్ కేసరి అనే టైటిల్‌ను తొలిసారిగా గెలుచుకున్నారు. అనంతరం స్పోర్ట్ కోటా కింద చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందారు. ఉద్యోగం చేస్తూనే 200 మంది విద్యార్థులకు ఉచితంగా కుస్తీ పోటీల్లో శిక్షణ ఇచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారామ్‌బాగ్ బోయిగూడ కమాన్‌లోని తన ఇంట్లో మృతదేహాన్ని సందర్శనార్థం ఉంచగా నగరంలోని పలువురు పహిల్వాన్లు తరలివచ్చి భౌతిక కాయంపై పుష్ప గుచ్ఛాలు పెట్టి శ్రద్ధాంజలి ఘటించారు. శనివారం ఉదయం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



డబీర్‌పురా: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న రాత్రి 11.45 గంటలకు ఓ వృద్ధుడు డబీర్‌పురా ఫ్లై ఓవర్ రోడ్డు దాటుతుండగా..వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి రిమాండ్


షేక్ ఖాజా పాషా

గౌలిపురా: సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని భవానీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ తలాబ్‌కట్టాకు చెందిన షేక్ ఖాజా పాషా (19) ఈనెల 26న లలితాబాగ్‌కు చెందిన భాగేశ్, మోజీషాకు చెందిన రెండు సెల్‌ఫోన్లు, ఖాన్‌నగర్‌లో మూడు సెల్‌ఫోన్లను దొంగలించాడు. కాగా దీనిపై భాగేశ్, మోజీషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం షేక్ ఖాజా పాషాను అరెస్ట్ చేసి ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి


షేక్‌పేట్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కురాకుల కృష్ణ తదితరులు..


వెంకటేశ్ తదితరులు..

దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఇతరులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి మౌనం పాటించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఆహార భద్రత, సమాచార హక్కు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి వంటి ఎన్నో అద్భుతమైన చట్టాలను తీసుకువచ్చారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– చార్మినార్,అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


నివాళులర్పిస్తున్న టీపీసీసీ లీగల్‌సెల్ న్యాయవాదులు, నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు


మన్మోహన్ సింగ్ చిత్ర పటంతో కేంద్రీయ విద్యాలయ బార్కాస్ బ్రాంచ్ విద్యార్థిని భవానీ


ఛత్రినాక చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నివాళులర్పిస్తున్న స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కే కృష్ణారావు


గాంధీభవన్‌లో శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్


సంతాప సభలో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి


లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ పథకాలు అందరికీ తెలిసేలా నిరుపేద విద్యార్థులకు విద్యా సహాయం అందేలా ఎన్జీఓలు కృషి చేయాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సూచించారు. రవీంద్రభారతిలో 'స్వచ్ఛ్ సోచ్ ఎన్జీఓ సంస్థ యొక్క లోగో'ను మాజీ మంత్రి గీతారెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథలకు అండగా ఉండడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలన్నారు. అనంతరం ఇద్దరు నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీఓ వ్యవస్థాపకుడు కే శ్రీనివాస్ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఉపాధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌గౌడ్, గాయని ఆమని తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల నిరసన


బాపుఘాట్‌లో నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

లంగర్‌హౌస్: గ్రామాల అభివృద్ధికి తాము చేసిన పనుల బిల్లులు వెంటనే చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లంగర్‌హౌస్ బాపుఘాట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపి గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలై కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోగా మరికొందరు అదే పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న భూతకాలం నాటకం


నాటకంలోని ఓ దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో శుక్రవారం భూతకాలం అనే నాటకాన్ని ప్రదర్శించారు. అత్యాశకు పోవడం వల్ల సంస్థ మానవాళి ఎదుర్కొంటున్న స్థితిగతులపై కళ్లకు కట్టినట్లు సాగిన నాటక ప్రదర్శన ఆహుతులను ఆలోచింప చేసింది. ప్రముఖ రచయిత ఎం.దివాకర్‌బాబు నాటకాన్ని రచించగా గోవాడ వెంకట్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో రసరంజని కార్యవర్గ సభ్యులు, నాటక ప్రియులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ


పడి పూజలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఎమ్మెల్యే

జియాగూడ: భుజంగరావు లేన్‌లోని రంగనాథ కల్చరల్ అసోసియేషన్‌లో రాంచందర్, బుక్క కిట్టు స్వాముల నేతృత్వంలో సురేశ్ యాదవ్, బొట్టు రామ్ గురుస్వామి, ఎంఎం రావుల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు తూంకుంట అరుణ్‌కుమార్, గోల్డ్ మెన్ శ్రావణ్‌కుమార్, కార్పొరేటర్ రాజు, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరబస్తీలో..

జియాగూడ: సబ్జిమండి ఉప్పరబస్తీలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్త సమాజ గోవింద్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. అనంతరం (భిక్ష) ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న స్వాములు

అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో..

నాంపల్లి: గోకుల్‌నగర్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో గురుస్వామి కల్యాణ్ నేతృత్వంలో గురుస్వామి అజయ్ ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ హాజరై పూజల్లో పాల్గొన్నారు.


అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో..

ఘనంగా అయ్యప్పస్వామి రథయాత్ర


రథయాత్రలో రాముయాదవ్ గురుస్వామి

అబిడ్స్: పంచగిరి వాస అయ్యప్ప ఆలయం నుంచి శుక్రవారం అయ్యప్ప స్వామి రథయాత్ర చేపట్టారు. రాము యాదవ్, నాని, చింటు, పవన్, సతీశ్ గురుస్వాములు పాల్గొన్నారు.

నవాబ్ అహ్మద్ ఆలమ్ సారథ్యంలోనే ప్రగతి

డాక్టర్ ఇఫ్తెఖారుద్దీన్, ఎం.ఎ.మతీన్



సాక్షి, సిటీబ్యూరో : నవాబ్ అహ్మద్ ఆలమ్ సారథ్యంలో మెస్కో మేనేజింగ్ కమిటీ విజయపథంలో ప్రయణిస్తున్నదని మెస్కో సెక్రటరీ డాక్టర్ ముహమ్మద్ ఇఫ్తెఖారుద్దీన్ తెలిపారు. దారుషిఫా మెస్కో దయాగ్నోస్టిక్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది మెస్కోను హస్తగతం చేసుకునేందుకు కుట్ర పన్నారన్నారు. అయితే మెస్కో కమిటీ చేసిన న్యాయ పోరాటంతో వారి ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. ఇప్పటికే సివిల్, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో దాఖలైన 70 పిటిషన్లలోనూ మెస్కో విజయం సాధించిందన్నారు. హైకోర్టు సింగిల్ బెంచ్, డబుల్ బెంచ్ రెండూ పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వడంతో ఇక బయటి వ్యక్తులు ఎవరికీ మెస్కోతో సంబంధం లేదన్నారు. మెస్కోలో సీనియర్ వైద్యుడిని మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం 45 ఏళ్లగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు. ఈ క్రమంలోనే మెస్కో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా అహ్మద్ ఆలం ఖాన్ ఎన్నికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా ఆలమ్ ఖాన్ మేనేజింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.ఎ.మతీన్ ఎన్నికయ్యారు. సమావేశంలో డాక్టర్లు ఇల్యాస్ ముహమ్మద్, అబ్దుల్ కబీర్, తంజీల్ మునవ్వర్, నాసిర్ ఖురైషీ, సయ్యద్ ముహమ్మద్ హుస్సైన్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

కోట కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి నెలకొన్నది. శుక్రవారం పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో టికెట్ కౌంటర్ నుంచి కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయం, నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో ప్రాంగణం తదితర ప్రాంతాలన్ని కిటకిటలాడాయి. మరోవైపు యువత కోటనగీనాబాగ్‌లో ఉన్న ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగారు.

పదం.. పద్యం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కిషన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, పాల్కూరికి పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన పదం..పద్యం పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్య కవి మొవ్వ వృషాద్రిపతికి భూమయ్య సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం తెలుగు విశ్వ విద్యాలయ పూర్వ ఉపకులపతి టి.కిషన్‌రావు మాట్లాడుతూ.. ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచనలు ఎంతో సరళంగా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు సాగి కమలాకర శర్మ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ రెడ్డి సేవలు చిరస్మరణీయం


డాక్టర్ ఏవీఎస్ రెడ్డికి నివాళులర్పిస్తున్న ఏవీఎస్‌నగర్‌వాసులు

రాజేంద్రనగర్: ఎన్ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.వి.ఎస్.రెడ్డి వర్ధంతిని శుక్రవారం రాజేంద్రనగర్‌లోని మానసా హిల్స్‌లోని ఏవీఎస్ రెడ్డినగర్‌లో ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఏవీఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... రూరల్ టెక్నాలజీ పార్కు నిర్మాణం సందర్భంగా స్థానికంగా పని చేస్తున్న నిరుపేదల కోసం డాక్టర్ ఏవీఎస్ రెడ్డి 23 ఇళ్లను నిర్మించి అందించారన్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఉద్యోగి బాగోగులను పట్టించుకున్న గొప్ప అధికారి అని కొనియాడారు. గుట్టలను చదును చేస్తూ పని చేస్తున్న కుటుంబాలను గుర్తించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆలోచించే మనసున్న మహారాజు ఏవీఎస్ రెడ్డి అని గుర్తు చేశారు. ఏవీఎస్ రెడ్డి తనయుడు విజయకృష్ణ తమ కాలనీలో నివాసముంటున్న వారికి మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి ఏవీఎస్ రెడ్డి కాలనీలో నివాసముంటున్న ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. కాలనీ నేతలు చెన్నమ్మ, మల్లేష్, సాయిలు, హనుమంతు, ఎల్లయ్య, దేవమ్మ, బండారి, శివరాం పాల్గొన్నారు.

విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు

ఖైరతాబాద్: కృత్రిమ మేధస్సు అన్ని విభాగాలకు విస్తరిస్తోందని ప్రముఖ శాస్త్రవేత్త యు. రాజాబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఏరోస్పేస్, రక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన వినియోగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు శాస్త్రవేత్త రాజాబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఏఐ ఏరోస్పేస్‌లో డిజైన్ తయారీ, ఇంధన పొదుపు, పరికరాల్లో లోపాలను గుర్తించడం, నాణ్యతను మెరుగుపర్చుకోవడంలో టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్షణ రంగంలో సరిహద్దుల భద్రత, ఆయుధాలు, మానవరహిత వాహనాల వినియోగంలో దోహదపడుతుందన్నారు. డీఆర్‌డీవో విశ్రాంత శాస్త్రవేత్తలు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామ్మోహన్ బాబులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, విశిష్టతను వివరించారు. ఈ సదస్సులో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య, కార్యదర్శి డాక్టర్ కె. సీతారాంబాబు, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎల్. నిర్మలా దేవి, వైఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

మణికొండ: మణికొండ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశామని మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మున్సిపల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించాల్సి ఉంది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిన విషయం విదితమే. వాయిదా పడిన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని తిరిగి నిర్వహించే తేదీని నిర్ణయించలేదని మేనేజర్ పేర్కొన్నారు. కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్న పనులన్నింటినీ ఇంజినీరింగ్ శాఖ ఎస్టిమేట్‌లు చేస్తున్నందున అవి పూర్తి కాగానే ఓ తేదీ నిర్ణయించి సమావేశం నిర్వహిస్తామన్నారు. త్వరగా ఎస్టిమేషన్‌లను పూర్తి చేయాలని వారికి సూచించామన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ



రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని హెల్ప్ ఆన్ వీల్స్ ట్రస్టు టీమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు శుక్రవారం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, అత్తాపూర్ బసవతారకమ్ ఆస్పత్రి, మెహిదీపట్నం ప్రాంతాల్లోని పేదలకు ఈ అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకుడు బండ్లగూడెం కవితా ప్రసాద్ మాట్లాడుతూ... ఆరు సంవత్సరాలుగా ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 200 మందికి అల్పాహారాన్ని అందజేసినట్లు వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆకలిని తీర్చేందుకు తమ వంతు సహాయ సహకారాలను ప్రతి నెలా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నిర్వాహకులు అప్పారెడ్డిగూడెం మహేందర్, కోరని కుమార్, రాజగోపాల్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్లలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ పర్యటన


స్థానిక నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ డివిజన్ బస్తీల్లో రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్వాన్ నుంచి పురానాపూల్ వరకు దర్బార్ మైసమ్మ ఆలయం నుంచి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం టోలిచౌకీ డివిజన్‌లోని నదీమ్ కాలనీలో పర్యటించారు. ఆయన వెంట టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

రాజేంద్రనగర్‌లో 'స్వచ్ఛతా పక్వాడా'


ఆలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలను చీపుర్లతో శుభ్రం చేసి తొలగించారు. టెక్నికల్ అధికారులు వెంకట్రాం, డాక్టర్ లక్ష్మణ్, ఎం.శేఖర్‌రెడ్డితో పాటు డాక్టర్ వెంకట్ కుమార్, డాక్టర్ పి.వెంకటేశం, పతియారా, నరసింహ, నార్మ్ ఫార్మ్ స్టాఫ్ పాల్గొన్నారు.



స్వచ్ఛతా పక్వాడాలో పాల్గొన్న నార్మ్ అధికారులు